హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ ఎన్నిక



ఎన్నికైన విద్యార్థి నాయకులతో స్కూల్ యాజమాన్యం

సుభాష్‌నగర్: విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని శ్రీనిధి గ్లోబల్ స్కూల్ చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వర రావు అన్నారు. గాజులరామారంలోని శ్రీనిధి గ్లోబల్ స్కూల్లో బుధవారం హెడ్ బాయ్, హెడ్ గర్ల్ నిమిత్తం ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు హెడ్ బాయ్, హెడ్ గర్ల్ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు



కైలాస్‌హిల్స్- షిరిడీహిల్స్ రోడ్డులో పారుతున్న మురుగునీరు

చింతల్: వాటర్ వర్క్స్ గాజుల రామారం సెక్షన్ పరిధి కైలాష్ హిల్స్‌లో మురుగునీరు రోడ్డుపై వరదలై పారుతుంది. రెండు రోజులుగా ఈ మురుగునీరు రోడ్లపై పారుతూ ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వస్తున్నా పట్టించుకునే అధికారి కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కైలాష్ హిల్స్‌లోని ఓ గల్లీలో భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లడంతో కైలాష్ హిల్స్ కమాన్ గుండా ఈ మురుగునీరు ప్రవహిస్తోంది. సుమారు 200 మీటర్ల వరకు మురుగునీరు ప్రవహిస్తుడడంతో కైలాష్ హిల్స్, షిరిడీ హిల్స్‌కు వెళ్లే వాహనదారులు పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో సెక్షన్‌కు ఒక్కో జట్టింగ్ మిషన్ ఉన్నప్పటికీ మురుగునీటి వ్యవస్థలో ఎటువంటి పారదర్శకత లేదని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. జట్టింగ్ మిషన్ల సిబ్బంది జలమండలికి వచ్చిన ఫిర్యాదుల కంటే స్థానికంగా వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ప్రైవేటుగా పనులు చేసుకోవడమే ప్రధాన ఆదాయంగా మల్చుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.


ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: ప్రజా యుద్ధ నౌక గద్దర్ 2వ వర్ధంతిని దయార్‌గూడలో సింగూరు పాండు ఆధ్వర్యంలో అంబేడ్కర్ పార్కులో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిత్యమాల కన్వీనర్ సింగూరు పాండు, కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేకల రమేష్, బీజేపీ జిల్లా నాయకుడు జక్కుల వినయ్ మాట్లాడారు. కడుపులో తూటా పెట్టుకొని బుల్లెట్ లాంటి పాటలతో ప్రభుత్వాలనే గడగడలాడించిన ప్రజా పోరాట యోధుడు గద్దర్ అని అన్నారు. కార్యక్రమంలో మేకల మహేష్ బాబు, పోతురాజు రమేష్, మద్ద అనిల్ కిషోర్ కుమార్, యాకుబ్, యాదగిరి, అక్కపల్లి రాము, కొండల్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి బస్తీ బాట



బస్తీ బాటలో సీజీఎం పాండ్యనాయక్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో విద్యుత్ సరఫరా సమస్యలపై బుధవారం సీజీఎం పాండ్యనాయక్ అధికారులు, సిబ్బందితో కలిసి బస్తీ బాట నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ట్రిప్పింగ్, లో ఓల్టేజ్ సమస్యలు, పాత లైన్ మరమ్మతులు వంటి అంశాలపై చర్చించారు. అధికారులు వారి సమస్యలను గమనించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి వినియోగదారుడి ఇంటికి నాణ్యమైన విద్యుత్ సేవలే తమ లక్ష్యమని సీజీఎం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చంద్రశేఖర్, డీఈ శ్యామ్ కుమార్, ఏడీఈ కమలాకర్, ఏఈ రాకేష్, నాయకులు నజీర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా 'డ్రెయిన్' పనులు!

- రంగారెడ్డినగర్ బస్టాప్ వైపు ముందుకు సాగని వైనం
- వర్షం పడ్డ ప్రతిసారి రోడ్డుపై చేరుతున్న వరదనీరు
- 2024 ఆగస్టులో రూ.1.65 కోట్ల నిధులతో పనులు ప్రారంభం



గాంధీనగర్ పారిశ్రామికవాడ రోడ్డులో డంప్ చేసిన పైపులు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సీఐఈ గాంధీనగర్, ఐడీపీఎల పరిధిలోని ప్రధాన రోడ్లపై ప్రతి వర్షాకాలంలో వరదనీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందులను తొలగించేందుకు 2024 ఆగస్టులో రూ.1.65 కోట్ల నిధులతో ఎస్‌పీ-4 డ్రెయిన్ పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని ఎర్రగోడల నుంచి గిరినగర్ అమ్మవారి ఆలయం వరకు, ప్లాట్ నంబర్ 113 నుంచి 87(నీలు ఇండస్ట్రీస్ నుంచి ఎస్వీ ఎంటర్ ప్రైజెస్ వరకు), ప్లాట్ నంబర్ 58 నుంచి 61 (మెక్ కాంపొనెంట్స్ నుంచి గ్రీన్ అక్వా ప్రైవేట్ లిమిటెడ్ వరకు), ప్లాట్ నంబర్ 61(గ్రీన్ అక్వా కంపెనీ నుంచి కవిత ఎయిర్ ఎక్విప్‌మెంట్ సిస్టం వరకు), ప్లాట్ నంబర్ 22 నుంచి 28 (ఎంఎంకే ఆఫ్‌సెట్ ప్రింటర్స్ నుంచి ఈశ్వర్‌సింగ్ కంపెనీ వరకు) పైపులైన్ పనులను మూడు నెలల్లో పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌కు టీజీఐఐసీ అధికారులు పనులు అప్పగించారు.

ఓ వైపు పూర్తి.. మరో వైపు అసంపూర్తిగా..

వంద రోజుల్లో పూర్తి చేయాల్సిన డ్రెయిన్ పైపులైన్ పనులు సంవత్సరం కావస్తున్నా కొలిక్కి రావడ లేదు. ఎర్రగోడల నుంచి గిరినగర్ వరకు, ఐడీపీఎల్ చౌరస్తా నుండి జగద్గిరిగుట్టకు వెళ్లే మార్గంలోని సీమెన్స్ పరిశ్రమకు పనులు పూర్తి అయ్యాయి. అయితే రంగారెడ్డినగర్ శివాజీ విగ్రహం ఎదురుగా ఉన్న బస్టాప్ ప్రాంతాన్ని ఆనుకున్ని చోట పైపులైన్ పనులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో డ్రెయిన్ నిర్మాణానికి తెచ్చిన భారీ పైపులు రంగారెడ్డినగర్ శివాజీ విగ్రహం సమీపంలో, గాంధీనగర్ పారిశ్రామికవాడ రోడ్డులో నిరుపయోగంగా పడి ఉన్నాయి.

> వరదనీరు సాఫీగా వెళ్లేందుకు కోట్లాది నిధులతో చేపట్టిన డ్రెయిన్ పైపులైన్ పనులకు డబ్బాలు ఆటంకంగా మారాయి. ఓ వైపు పూర్తైన పనులు మరో పక్క అసంపూర్తిగా మిగిలిపోవడంతో రోడ్డుపై వరదనీరు చేరుతోంది. పైపులైన్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న డబ్బాలను తొలగించాలని అధికారులు కోరుతున్నా ఓ ప్రజాప్రతినిధి అండదండలతో డబ్బాల నిర్వాహకులు మొండికేస్తున్నట్లు తెలుస్తోంది.

అడ్డు తగులుతున్న డబ్బాల నిర్వాహకులు

రంగారెడ్డినగర్ బస్టాప్ నుంచి 100 మీటర్ల మేర పైపులైన్ పనులు నిలిచిపోయాయి. స్థానికంగా ఉన్న డబ్బాల నిర్వాహకులు పనులు ముందుకు సాగకుండా అడ్డు తగులున్నారు. దీంతో 80 శాతం మేర పనులు పూర్తయినా ఆ ప్రాంతంలో పనులు చేపట్టకపోవడంతో వర్షం పడ్డ సమయంలో పై ప్రాంతం నుంచి వచ్చే వరదనీరు ఇక్కడ చేరుతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సదరు డబ్బాల నిర్వాహకులు మొండికేయడం వెనుక ఓ ప్రజాప్రతినిధి ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఐలా అధికారులు, కాంట్రాక్టర్ ఏమీ చేయలేక పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా బస్ షెల్టర్‌ను సైతం తొలగించి డబ్బాలు ఏర్పాటు చేయడం గమనార్హం. గ్రీనరీ ప్రాంతంలో వెలిసిన డబ్బాలను తొలగించేందుకు ఐలా అధికారులు పలుసార్లు యత్నించినా సదరు ప్రజాప్రతినిధి ఒత్తిడితో వెనక్కి తగ్గినట్లు ప్రచారం జరుగుతుంది.

పనులు వేగవంతం చేస్తాం

దాదాపు పైపులైన్ పూర్తయ్యాయి. రంగారెడ్డినగర్ బస్టాప్ ప్రాంతంలో టెక్నికల్ సమస్య, డబ్బాలు అడ్డుగా ఉండటంతోనే పనులు ఆగిపోయాయి. సదరు ప్రాంతంలో సైతం త్వరలోనే పనులు పూర్తి చేసి వరదనీరు చేరకుండా చర్యలు తీసుకుంటాము. ప్రతి ఒక్కరూ పనుల పూర్తికి సహకరించాలి.

– అంజయ్య, టీజీఐఐసీ డీజీఈ, జీడిమెట్ల



వాటర్ డ్రెయిన్ పనులు నిలిచిపోయిన డబ్బాలు ఉన్న ప్రాంతం



రంగారెడ్డినగర్ బస్టాప్ ప్రాంతంలో రోడ్డుపై చేరిన వరదనీరు(ఫైల్)

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులకు శంకుస్థాపన చేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని రోడ్డు నంబర్ 16వ వార్డు రాజీవ్ గాంధీ నగర్‌లో బుధవారం సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, ఎస్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, తడకండి సాయిరాజ్, ఎర్రోళ్ల విష్ణు, ఎత్తరి నాని, మహ్మద్ షకీల్, బొమ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా సీసీ రోడ్డు నిర్మాణం!



కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీఎన్ఆర్ కాలేజీ ఎదురుగా నిర్మిస్తున్న సీసీ రోడ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారం ఆర్ఎంసీ విధానాన్ని అనుసరించాల్సి ఉండగా.. అక్కడ మాత్రం మాన్యువల్ మిక్సింగ్‌తోనే పనులు సాగుతున్నాయని తెలిపారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం మాన్యువల్ మిక్సింగ్ ఉపయోగించినప్పుడు 50 శాతం రోబోసాండ్, 50 శాతం రివర్‌సాండ్ మిశ్రమాన్ని వినియోగించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుత పనుల్లో పూర్తిగా రోబో సాండ్ ఉపయోగిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. దీనివల్ల రోడ్ల నాణ్యత గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి నిర్మాణ లోపాలను చూసిన ఇంజనీరింగ్ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా అందించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తల రుణాలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు. బుధవారం ప్రగతినగర్‌లోని పట్టాభి రామాంజనేయ దేవాలయ ప్రాంగణంలో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతన వ్యాపారం. రుణ సదుపాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత పూచీకత్తుతో రుణాలు ఇచ్చే సదుపాయంతో పాటు సబ్సిడీలతో కూడిన రుణాలు కూడా ప్రభుత్వాలు అందిస్తున్నాయన్నారు. ప్రధానంగా ప్రభుత్వాలు అందించే వివిధ రుణాలను నాలుగు వర్గాలుగా ఉన్నాయని, వాటిని ఆయా వెబ్‌సైట్‌లలో పరిశీలించి అర్హతలను బట్టి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ ఏవీ మూర్తి, జిల్లా పారిశ్రామిక బాధ్యులు మాధురి, పూర్వ లీడ్ బ్యాంక్ మేనేజర్ భుజంగరావు, సోమేశ్వర్లు, పి.శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, శిరీష, ఆనంద్, కృష్ణ, బి.శైలజ, ఎం.జానకి, సునీత, ఎన్.సురేంద్రనాథ్, పీవీఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన సైబర్ దొంగలు

పెట్టుబడి పేరుతో మోసం
- ఒకేరోజు ఆరు కేసులు నమోదు..
- 5,71,000 కాజేసిన కేటుగాళ్లు

సనత్‌నగర్: పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ మోసగాళ్లు రెచ్చిపోయారు. ఒకేరోజు ఆరు కేసుల్లో ముగ్గురి నుంచి రూ.5,71,000లను కాజేశారు. తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు పొందవచ్చంటూ ఆకర్షణీయమైన ఆఫర్లు ఇస్తూ అమాయకులను బురిడీ కొట్టించి సొమ్ము చేసుకున్న ఘటనలు సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. ఒకేరోజు ఆరు కేసులు నమోదు కావడం ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు కలవరపెడుతున్నాయి. వివరాల్లోకి వెళితే..సనత్‌నగర్‌కు చెందిన సౌమ్య (33) మొబైల్ ఫోన్ వాట్సప్‌కు పెట్టుబడి ఆఫర్ సందేశం వచ్చింది. దీంతో ఆమె అవతలి వారు చెప్పినట్లుగా యూపీఐ ద్వారా రూ.50,000లను పంపించింది. అలాగే మరో పెట్టుబడి సందేశానికి ఆకర్షితురాలై రూ.1,30,000లను వివిధ యూపీఐ ఐడీలకు పంపించింది. అయితే ఈ రెండు సంఘటనలకు సంబంధించి డబ్బులు పంపించిన దగ్గర నుంచి అవతలి వ్యక్తుల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో యువకుడి నుంచి రూ.2,25,000

సనత్‌నగర్‌కు చెందిన నిఖిల్ (27) తన టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడి ఆఫర్‌ను అందుకున్నాడు. ఇందులో వారు ఐపీఓలో కొన్ని అధిక రాబడి స్కీములు ఉన్నాయని చూపించారు. ఆపై లాభాలను పొందడానికి కొంతమొత్తాన్ని పెట్టుబడి పెట్టమని సూచించారు. దీంతో నిఖిల్ వారిని నమ్మి రూ.1,45,000లను పంపించాడు. మరో కేసుకు సంబంధించి నిఖిల్ ఇదే విధమైన పెట్టుబడి ఆఫర్‌ను అందుకుని రూ.80,000 యూపీఐ ద్వారా పంపించాడు. ఆ తర్వాత అతను సంపాదించిన లాభాన్ని పొందేందుకు మరికొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టమని అడిగారు. దీంతో తాను రూ.2,25,000లు మోసపోయానంటూ సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు.

మరో బాధితుడి నుంచి రూ.1,66,000లు

సనత్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ (42) మొబైల్ ఫోన్ వాట్సప్‌కు వచ్చిన పెట్టుబడి ఆఫర్‌ను నమ్మి రూ.1.36,000లను పంపించాడు. అదే బాధితుడు మరో కేసులో రూ.30,000లు పెట్టుబడి మోసానికి గురయ్యాడు. మొత్తం రూ.1,66,000లు నష్టపోయానంటూ బాధితుడు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయా కేసులను సనత్‌నగర్ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రంగారెడ్డినగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేక సమస్యలు పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఎద్దేవా చేశారు. గిరిజన, దళిత, బీసీ గురుకులాల్లో మౌలిక వసతుల సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్, ఉపాధ్యక్షుడు సుబ్బు, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి భగత్, ఉపాధ్యక్షుడు రెహన్, సాయిచరణ్, మల్లికార్జున్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు

కూకట్‌పల్లి: ఆంగ్ల వ్యాకరణం, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం, సంగణన విజ్ఞానశాస్త్ర శిక్షణాంశాల్లో ఆదివారం ప్రత్యేక శిక్షణ తరగతులను కళాశాలల విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరంలో యువ వికాస్, శ్రీ రామకృష్ణ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ, మియాపూర్‌లలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నెలవారీ ఉపకార వేతనాలను అందిస్తున్నామని తెలిపారు. ఔత్సాహికులు శ్రీరామకృష్ణ వివేకానంద సేవా సమితి, ధ్యానమందిరం, ప్లాట్ 166, రాధామాధవ్ అపార్టుమెంట్ జంక్షన్ దగ్గర, ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీ, మియాపూర్, ఫోన్ 9059892038 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మూసాపేట: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన మంగళి సరిత (37) 5 సంవత్సరాల నుంచి కూకట్‌పల్లి, సంగీత్‌నగర్‌లో తన 12 సంవత్సరాల కొడుకుతో ఇంటి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. బుధవారం ఉదయం 6 గంటలకు కొడుకు తల్లి ఇంకా నిద్ర లేవలేదని తలుపు తట్టి తీయగా.. ఆమె నిద్ర లేవలేదు. దీంతో స్థానికుల సహాయంతో తల్లి మొహంపై నీళ్లు చల్లినా లేవకపోవటంతో కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒంటిపైన ఎలాంటి గాయాలు లేవని, ఎలా చనిపోయిందో తెలియకపోవటంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



సూరారం డివిజన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



వాజ్‌పేయినగర్‌లో గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో రేణుక



నందానగర్‌లో తల్లి పాల ప్రాధాన్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్ జ్ఞానేశ్వరి

కుత్బుల్లాపూర్: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కార్యక్రమాలు నిర్వహించారు. సూరారం కాలనీలో తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, యూపీహెచ్‌సీ డాక్టర్ షహనాజ్, కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వాజ్పేయి నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ రేణుక, సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ, జీవీ రమణ, రేణుక, డాక్టర్ కిరణ్మయి, ఆశా వర్కర్ నవనీత కాలనీవాసులు పాల్గొన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆరు నెలల వరకు పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు.

తల్లిపాలపై ఇంటింటి ప్రచారం

రంగారెడ్డినగర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటి ప్రచారం చేపట్టారు. రెండేళ్ల లోగా పిల్లలున్న ఇళ్లను సందర్శించి వారికి ఇవ్వాల్సిన పోషక పదార్థాలు, అదే విధంగా చంటి పిల్లలకు పాలు ఇవ్వడం ద్వారా చేకూరే ఆరోగ్యం తదితర అంశాలను తల్లులకు వివరించారు. రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్ 2 అంగన్‌వాడీ టీచర్ జ్ఞానేశ్వరి, హెల్పర్ సునీతలు తమ పరిధిలోని చంటి పిల్లల ఇళ్లను సందర్శించి వివరాలు సేకరించారు. వారికి తూచా తప్పకుండా టీకాలు ఇప్పించాలని సూచించారు. అదే విధంగా వెంకట్రామిరెడ్డినగర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పలువురు తల్లులకు అవగాహన కల్పించారు.

చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలి



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: బతుకమ్మ రోడ్డులో అడ్డగోలుగా చెత్త వేసి అధ్వానంగా చేస్తున్నారని, అలాంటి వారిపై నిఘా పెట్టి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ బతుకమ్మ రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణపై జీహెచ్ఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జమీల్ అహ్మద్, ఎస్ఎఫ్‌లతో కార్పొరేటర్ బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ఎస్ఎఫ్ఏల పనితీరు సరిగ్గా లేకపోతే జోనల్ కమిషనర్, డీసీ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరేశం గుప్తా, ఎస్ఎఫ్ఏలు శ్యామ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ స్ఫూర్తిని కొనసాగించాలి

జయంతి సందర్భంగా ఘన నివాళి



దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

కుత్బుల్లాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. జయశంకర్ స్ఫూర్తిని నేటితరం కొనసాగించాలని సూచించారు. షాపూర్‌నగర్ ఉషోదయ టవర్ వద్ద తెలంగాణ ఉద్యమకారుడు సుధాగాని వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రశేఖర్, రమేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ మల్లారెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు చిత్రపటానికి పూలమాలలు వేశారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణారెడ్డి, ఉద్యోగులు



గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ మల్లారెడ్డి తదితరులు



షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు, తదితరులు